సాక్షి ప్రకాశం

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



పశువుల మూగరోదన

పశువులకు రోగం వస్తే చికిత్స అందడం లేదు. జిల్లాలోని పశువైద్యశాలల్లో మందుల కొరత ఏర్పడింది. ప్రభుత్వం నుంచి పశువైద్యశాలలకు మందుల సరఫరా నిలిచిపోయింది. - 10లో..



కారు కావాలా.. డబ్బు కావాలా

ఫ్లిప్ కార్ట్ నుంచి బహుమతులు ఇస్తామంటూ ఫోన్ చేసి మాయమాటలతో రూ.1.64 లక్షలు కాజేశారంటూ ఓ బాధితుడు ఎస్పీ దామోదర్‌కు ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేశాడు. - 10లో..

గరిష్టం/కనిష్టం
35/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రిపూట చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

డీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన ఓబులేసు



కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసిన డీఆర్‌ఓ ఓబులేసు

ఒంగోలు అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)గా బీ ఓబులేసు సోమవారం డీఆర్‌ఓ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణలను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీఆర్‌ఓను రెవెన్యూ, సివిల్ సప్లయిస్ ఇతర అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు డిక్షనరీ వినియోగించేలా తర్ఫీదు



విద్యార్థిని నుంచి ప్రశ్నల ద్వారా సమాచారం తెలుసుకుంటున్న ఏఎంఓ రమేష్


ఒంగోలు సిటీ: విద్యార్థులు డిక్షనరీ వినియోగించేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ అన్నారు. పోలీస్ క్వార్టర్స్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంఓ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు డిక్షనరీ ఉపయోగించే విధానం, ఐదో తరగతి విద్యార్థులను పరిశీలించారు. లైబ్రరీ పుస్తకాలు విద్యార్థులు వినియోగించేలా వారంలో ఒక పిరియడ్ కేటాయించాలని ఆదేశించారు. సెలవులో ఉన్న ఉపాధ్యాయుల వివరాలు పాఠశాల ప్రారంభించగానే నమోదు చేయాలన్నారు. విద్యార్థులందరూ యూనిఫాం ధరించి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. నవంబరు నెలలో నిర్వహించబోయే తరల్ మిడ్‌లైన్ పరీక్షకు 3, 4, 5వ తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్దేశించిన పనులు నిర్ణీత సమయంలో చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ పరంగా నిర్దేశించిన పనులు నిర్ణీత సమయంలో చిత్తశుద్ధితో పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో కలిసి ఎంపీడీవోలు, తహశీల్దార్లు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, ఏపీడీ, ఏపీవో, డీఈ, ఈఈలతో పలు అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రలు అందచేసి అర్జీలను వేగంగా పరిష్కరించాలన్నారు. 31వ తేదీ దీపావళి పండుగ నేపథ్యంలో పెన్షన్ నగదును 30వ తేదీనే బ్యాంకుల నుంచి డ్రా చేయాలన్నారు.సమావేశంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, సీపీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్, ఇరిగేషన్ ఎస్‌ఈ వరలక్ష్మి, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల పాల్గొన్నారు.

బాబు మార్కు దగా..



అసంపూర్తిగా ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం

పశ్చిమ ప్రకాశానికి సీఎం చంద్రబాబు దగా చేశారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లా చేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానంటూ హామీల వర్షం కురిపించారు. అయితే జిల్లా ఏర్పాటు ఇప్పట్లో లేదంటూ ఆయన చేసిన ప్రకటన ఈ ప్రాంతవాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ ఏడాది ఎంబీబీఎస్ అడ్మిషన్లపై వెనకడుగు వేయడమే కాకుండా ప్రిన్సిపాల్‌ను బదిలీ చేశారు. 35 మంది వైద్య నిపుణుల బదిలీకి రంగం సిద్ధమైందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రారంభం దశలో ఉన్న మెడికల్ కళాశాలకు సైతం మంగళం పాడనున్నారని తెలుస్తోంది. ఇక వెలుగొండ ప్రాజెక్టు ప్రస్తావనే లేకపోవడం అడుగడుగునా చంద్రబాబు మార్కు వంచన కనిపిస్తోందని పశ్చిమ ప్రకాశం వాసులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

- మార్కాపురం జిల్లా చేస్తానంటూ ఎన్నికల ప్రచార సభల్లో బాబు హామీ
- అధికారంలోకి వచ్చాక ఇప్పుడే ఆలోచన లేదంటూ ప్రకటన
- మెడికల్ కళాశాలకూ మంగళం
- ఇప్పటికే ప్రిన్సిపల్, సూపరింటెండెంట్లు బదిలీ
- సుమారు 35 మంది వైద్య నిపుణులు బదిలీకి సిద్ధం
- వైఎస్సార్‌సీపీ హయాంలో 80 శాతం పూర్తయిన మెడికల్ కాలేజీ భవనాలు
- ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చర్యలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక మెడికల్ కళాశాలకు గ్రహణం

సాక్షి ప్రతినిధి ఒంగోలు:

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పశ్చిమ ప్రకాశంలో బహిరంగ సభలు నిర్వహించారు. అధికారంలోకి వస్తే పశ్చిమ ప్రాంతం రూపురేఖలు మార్చేస్తామంటూ హామీలు గుప్పించారు. చంద్రబాబునాయుడు, మార్కాపురం, పొదిలి వచ్చి నిర్వహించిన బహిరంగ సభల్లో తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురాన్ని జిల్లా చేస్తామని పదే, పదే తన ప్రసంగంలో ప్రస్తావించారు. గిద్దలూరు వేదికగా పవన్ కళ్యాణ్ నిర్వహించిన సభలో సైతం పలు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఈ ప్రాంతంపై వారు ఎలాంటి ఊసూ ఎత్తకపోవడం గమనార్హం. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటైతే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. కేంద్రం నుంచి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకం కింద నిధులు వస్తాయి. వెలుగొండ పూర్తవుతుంది.. పంటలు పండుతాయి... పిల్లలు బాగా చదువుకుంటారన్న ఆశ ఏర్పడింది. దీంతో ప్రజలు నమ్మి కూటమి ప్రభుత్వానికి ఓటువేశారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్, ఎస్పీ, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, డీఆర్‌డీఏ, డ్వామా తదితర శాఖల ఉన్నతాధికారులు ఇక్కడే ఉండి అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలిస్తారు. ప్రస్తుతం జిల్లాకేంద్రమైన ఒంగోలుకు వెళ్లాలంటే అర్ధవీడు నుంచి 125 కిలోమీటర్లు, పుల్లలచెరువు నుంచి ఒంగోలుకు 170 కిలోమీటర్లు, గిద్దలూరు నుంచి ఒంగోలుకు 150 కిలోమీటర్లు, దోర్నాల నుంచి ఒంగోలుకు 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. వివిధ పనుల నిమిత్తం ప్రతిరోజూ ప్రజలు ఒంగోలుకు వెళ్లాలంటే అనేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటైతే అధికార వికేంద్రీకరణతోపాటు అభివృద్ధి కూడా త్వరగా జరిగే అవకాశం ఉంది.

ఈ ప్రాంత ప్రజల ఆశలు అడియాశలు..

ఈ ప్రాంత ప్రజల ఆశలపై సీఎం చంద్రబాబు నీళ్లు జల్లారు. రెండు వారాల కిందట విజయవాడలో జరిగిన ఓ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా ఏర్పాటుకు తాము హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని, ఇప్పట్లో కాదని ప్రకటించారు. దీంతో జిల్లా వస్తుందని ఆశతో ఎదురుచూసిన మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గాలకు చెందిన ప్రజలు నిరాశకు లోనయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ ప్రాంత ఎమ్మెల్యేలందరూ త్వరలో మార్కాపురం జిల్లా అంటూ ఊదరగొట్టారు. తీరా ప్రభుత్వాధినేత చంద్రబాబు చేసిన ప్రకటనతో ఆ పార్టీ ఎమ్మెల్యేల గొంతులో వెలక్కాయ పడినట్లైంది. ఇప్పట్లో జిల్లా రాదనే నిర్ణయానికి వచ్చారు. 2026లో ఎలాగూ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరుగుతుంది. అందులో భాగంగా మార్కాపురం జిల్లా ఏర్పాటుకానుంది. ఇక కూటమి ప్రభుత్వం చేసిందేముందనే భావన ప్రజల్లో నెలకొంది.

వెనక్కు పోయిన మెడికల్ కాలేజీ

పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల కోరికను గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. మార్కాపురంలో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీని మంజూరుచేసి ఎన్నికల నాటికి 75 శాతం నిర్మాణ పనులు పూర్తిచేయించారు. జిల్లా వైద్యశాలను సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిగా మార్చి 75 మంది వైద్యులను నియమించి 150 మెడికల్ సీట్ల కోసం ప్రతిపాదనలు పంపారు. మెరుగైన వైద్యసేవలు అందించే ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే మెడికల్ కాలేజీకి గ్రహణం పట్టింది. ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం కావాల్సి ఉంది. దానికి ప్రభుత్వం మోకాలడ్డింది. నిధులు నిలిపివేయడంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తాజాగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను బదిలీ చేసింది. అంతేకాదు ఇక్కడ పనిచేస్తున్న నాన్ క్లినికల్ వైద్యనిపుణులను సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఇతర మెడికల్ కళాశాలలకు పంపారు. ఈ కళాశాల ఏర్పాటైతే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్న ఈ ప్రాంత వాసుల కోరిక నెరవేరకుండా పోతోంది.



నాడు మార్కాపురం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు (ఫైల్)

వెలుగొండకు శంకుస్థాపన చేసింది నేనే.. ప్రారంభించబోయేది నేనే..

వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది నేనే..ప్రారంభించబోయేది కూడా నేనే అంటూ ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు ఘనంగా చెప్పారు. అధికారంలోకి వచ్చాక పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. వాస్తవానికి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రాజెక్టు పనులు అత్యంత వేగంగా జరిగాయి. ఆయన అకాల మరణం తర్వాత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు దీనిని పట్టించుకోలేదు. 2014 నుంచి 2019 వరకూ టీడీపీ హయాంలో ప్రాజెక్టు పనులు నత్తను తలపించాయి. అత్తెసరు నిధులు కేటాయించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రెండు టన్నెల్స్ నిర్మాణాలు పూర్తయ్యాయి. సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. అధికారంలోకి వచ్చి 5 నెలలు పూర్తి కావస్తున్నా ఈ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు అసలు పట్టించుకున్న దాఖలాల్లేవు.

త్వరగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి



మార్కాపురం ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే ప్రకటన చేయాలి. ప్రజలంతా జిల్లా ఏర్పాటు కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల నిర్ణయాన్ని గౌరవించి త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– పీఎల్‌పీయాదవ్, బీసీ జాతీయ సంఘం కార్యదర్శి, మార్కాపురం

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్



సైన్స్ ఫేర్‌లో తాము చేసిన ప్రయోగాన్ని కలెక్టర్‌కి వివరిస్తున్న విద్యార్థినులు

- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

కొండపి: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కొండపిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జోన్ స్థాయి సైన్స్ ఫేర్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఫ్యూచర్ ఆన్ 2024–25 పేరుతో రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంగీత వాయిద్యాలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించి ఎగ్జిబిషన్‌లో పెట్టిన వివిధ ప్రాజెక్టులను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైన్స్ ఫేర్ వలన విద్యార్థుల్లో తమ ప్రతిభ చాటుకోవాలనే పోరాట స్ఫూర్తి పెరుగుతుందన్నారు. బాలికలు 18 సంవత్సరాలు నిండే వరకు పెళ్లి చేసుకోకుండా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏపీ.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్. జిల్లా కోఆర్డినేటర్ డీ జయ మాట్లాడుతూ ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నేపథ్యాన్ని వివరించారు. సైన్స్, మ్యాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఐసీటీ, ఆర్ట్స్అండ్ సైన్స్ విభాగాల్లో సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21 సైన్స్ ఫేర్‌లలో 165 మంది, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 11 సైన్స్ ఫేర్‌లలో 95 మంది, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 8 సైన్స్ ఫేర్‌లలో 65 మంది సైన్స్ ప్రదర్శనలిచ్చారు. వారిలో ఉత్తమ ప్రదర్శనలిచ్చిన 61 మందికి ప్రస్తుతం జోనల్ స్థాయిలో అవకాశం కల్పించామని తెలిపారు. జోనల్ స్థాయిలో 16 నుంచి 20 మందిని ఎంపిక చేసి గుంటూరు జిల్లా ఉప్పలపాడులో నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌కు పంపుతామని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీ.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్. గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ కే పద్మజ, నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ కే జయలక్ష్మి, ఎంపీడీవో రామాంజనేయులు, తహసీల్దార్ మురళి, ఎంఈఓ–1 సురేఖ ఎంఈఓ– 2 రామారావు, ప్రిన్సిపాల్ అరుణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ చాంబర్ ముట్టడి

- తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల నిరసన



కమిషనర్ చాంబర్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

మార్కాపురం టౌన్: అక్రమంగా తొలగించిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం కమిషనర్ నారాయణరావు చాంబర్‌లో కూర్చుని తమ నిరసన తెలిపారు. తమను అక్రమంగా తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. అయితే కమిషనర్ పోలీసులను పిలిపించి వారిని బయటకు పంపే ప్రయత్నం చేశారు. దీంతో కాంట్రాక్టు కార్మికులు పోలీసుల కాళ్లుపట్టుకుని తమను అక్రమంగా తొలగించారని, విధుల్లోకి తీసుకునేలా ఒప్పించి న్యాయం చేయాలని వేడుకొన్నారు. అయినా కనికరించని అధికారులు, పోలీసులు నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులను చాంబర్ నుంచి బయటకు పంపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు 14 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నా ఇటు అధికారుల నుంచి కానీ, రాజకీయ నాయకుల నుంచి కానీ స్పందన రాకపోవడంతో ఆందోళనను ఉధృతం చేస్తున్నామన్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా నాయకులు చెప్పిన మాటలను అధికారులు పాటిస్తూ తొలగించడం సక్రమమైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, షబ్బీర్, యూసఫ్, కనకయ్య, అల్లూరయ్య, సుబ్రమణ్యం, చెన్నకేశవులు, శేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సోమవారం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి గ్రీవెన్స్ హాలులో మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 242 అర్జీలు వచ్చాయి. గ్రీవెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మొక్కుబడి పరిష్కారాలు చూపితే సహించేది లేదన్నారు. గ్రీవెన్స్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అవినీతికి వ్యతిరేకంగా బాధ్యత గల పౌరునిగా ప్రవర్తిస్తామంటూ అధికారులు, సిబ్బందితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. దీనిలో డీఆర్‌ఓ బీ చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

- కొత్తపట్నం మండలం అల్లూరుకు చెందిన వల్లెపోగు పేరమ్మ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తనకు గత 25 ఏళ్లుగా వృద్ధాప్య పింఛన్ వస్తుందని తెలిపింది. అయితే కొన్ని నెలలుగా వేలిముద్రలు సరిగా పడక పింఛన్ రావడంలేదని, సమస్యను పరిష్కరించి పింఛన్ వచ్చేలా చూడాలని కోరుతూ అర్జీ అందజేసింది.
- ఒంగోలు సీతారామపురానికి చెందిన రాధారమణగుప్తా గ్రీవెన్స్ అధికారులను కలిసి ఎటువంటి తప్పిదం లేకుండానే ట్రాఫిక్ పోలీసు నుంచి చలానా చెల్లించాలంటూ డిమాండ్ నోటీసు వచ్చిందని ఫిర్యాదు చేశాడు. తాను ఎప్పుడూ ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించలేదని అయిన అపరాధ రుసుం రూ.535 చెల్లించాలని డిమాండ్ వచ్చిందని తెలిపాడు. ఎటువంటి తప్పు చేయని తనకు వచ్చిన అపరాద రుసుమును రద్దు చేయించాలని కోరుతూ అర్జీ అందజేశాడు.
- నాగులుప్పలపాడు మండలం చేకూరుపాడు గ్రామానికి చెందిన రైతులు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తమ పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు గ్రామంలో సుమారు 200 ఎకరాల్లో వర్షపు నీరు నిల్వ చేరిందని తెలిపారు. కింద గ్రామాలైన వలేటివారిపాలెం, కరవదికి చెందిన రైతులు నీరు కిందకు వెళ్లకుండా కాలువలకు అడ్డుకట్టలు వేశారని, దీంతో పొలాల్లోనే నీరు ఉందని తెలిపారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుని పొలాల్లోని నీటిని బయటకు పంపాలని కోరుతూ అర్జీ అందజేశారు.

మద్యం దుకాణం తీసేయండి సారూ..



మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉప్పుగుండూరు గ్రామస్తులు

- కలెక్టరేట్ వద్ద ధర్నా చేసిన ఉప్పుగుండూరు గ్రామస్తులు

ఒంగోలు టౌన్: నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతూ నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు గ్రామ ప్రజలు ధర్నా నిర్వహించారు. గ్రామంలోని పురుషోత్తం కాలనీ, ఎస్టీ కాలనీలకు చెందిన పలువురు మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. గ్రామంలోని మట్టిగుంట గ్రామానికి వెళ్లే దారిలో బెల్లం సీతారామయ్య మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారని, ఇది నివాస గృహాల మధ్యలో ఉండడంతో మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఈ మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణకు వినతి పత్రం అందజేశారు.

హైస్కూల్ ప్రాంగణంలో బాణసంచా దుకాణాలు

- అడ్డుకున్న హైస్కూల్ సిబ్బంది



బాణాసంచా దుకాణాలు ఏర్పాటుకు సిద్ధం అవుతున్న వ్యాపారులు

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకులు సోమవారం సన్నద్ధం అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆ పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ అభ్యంతరం తెలపడంతో అక్కడ కాసేపు వాదోపవాదాలు జరిగాయి. గతంలో స్థానిక సాయిబాబా గుడికి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు. ఆ స్థల యజమానులు అభ్యంతరం తెలపడంతో దుకాణాదారులు ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వచ్చింది. హైస్కూల్ ఆవరణలో ఉన్న వైఎస్సార్ క్రీడా వికాస కేంద్రం వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకుంటామని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ నుంచి అనుమతి పొందినట్లు వ్యాపారులు తెలిపారు. ముందుగా రెవెన్యూ శాఖా, పోలీస్, ఫైర్ శాఖావారి అనుమతులు అవసరం ఉంటుంది. వారు కూడా అందుకు సమ్మతించినట్లు తెలుస్తోంది. దుకాణాల ఏర్పాటును అడ్డుకుంటున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ బాలకిషోర్, ఎస్సై చౌడయ్య తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని అభ్యంతరం తెలిపేవారిని సర్దిచెప్పటానికి ప్రయత్నించారు. హైస్కూల్, క్రీడా ప్రాంగణం ఉన్న క్యాంపస్‌లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రధానంగా జిల్లా విద్యాశాఖాధికారి, ఆ స్కూల్ హెడ్మాష్టర్ అనుమతి ఇవ్వాల్సి ఉంది. వారు అందుకు అనుమతి ఇవ్వలేదని ఇన్‌చార్జి హెచ్‌ఎం తెలిపారు. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు రెవెన్యూ శాఖ స్థలం చూపించాల్సి ఉందని, వ్యాపారులు అధికారుల అనుమతితో ఎక్కడైనా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న ప్రాంతాల్లో తమ నిబంధనలను పాటించాల్సి ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఆ శాఖాధికారి మాల్యాద్రి తెలిపారు. హైస్కూల్ ప్రాంగణంలో పిల్లలు ఆడుకుంటుంటారని, పట్టణంలోని అనేక మంది వాకింగ్‌కు అక్కడికి వెళ్తుంటారని, అటువంటి చోట దుకాణాలు ఏర్పాటుకు సమ్మతి ఇవ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని పలువురు వ్యాఖ్యానించారు. బాణా సంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు మరో ప్రాంతంలో స్థలాన్ని పరిశీలిస్తామని తహసీల్దార్, ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి యువకుడు మృతి


మృతిచెందిన ఆనంద్

గిద్దలూరు రూరల్: ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామ పరిధిలోని భీమలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో గల సగిలేరువాగు వద్ద సోమవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. కె.ఎస్.పల్లె గ్రామానికి చెందిన గడ్డం ఆనంద్ (23) అనే యువకుడు స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు సగిలేరు వాగులోకి దిగాడు. ప్రమాదవశాత్తూ వాగులోని లోతట్టు ప్రాంతంలో కూరుకుపోయాడు. నీటిలో మునిగిపోయిన ఆనంద్‌ను తోటి ఈతగాళ్లు వాగులో నుంచి బయటకు తీశారు. అప్పటికే ఆనంద్ మృతి చెందాడు. ఆనంద్ తల్లిదండ్రులతో పాటుగా బంధువులు పెద్ద ఎత్తున చేరుకుని భోరున రోదించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు తండ్రి గడ్డం శ్రీను వ్యవసాయ కూలీ కాగా, అతడికి ఇద్దరు కుమారులు. మృతుడు ఆనంద్ రెండో కుమారుడు. గ్రామంలో కూలి పనులకు వెళ్తుంటాడు.

నవంబర్ 11లోపు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు సిటీ: జిల్లాలో మార్చి/ఏప్రిల్ 2025లో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన రెగ్యులర్ విద్యార్థులు రూ.125 పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 28 నుంచి నవంబర్ 11వ తేదీలోగా చెల్లించాలని ఏసీ కె.శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులు మూడు సబ్జెక్టులకు పైబడి రూ.125, ఆలోపు అయితే రూ.110, ఒకేషనల్ వారు ఫీజుకు అదనంగా రూ.60 చెల్లించాలన్నారు. టెన్త్ పరీక్షలకు నిర్దేశిత వయసు కంటే తక్కువ ఉన్న విద్యార్థులు రూ.300 చెల్లించాలన్నారు. చెల్లించిన వారి నామినల్ రోల్స్‌తో పాటు సంబంధిత డాక్యుమెంట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నవంబరు 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగానికి సమర్పించాలన్నారు. రూ.50 ఫైన్‌తో నవంబరు 12 నుంచి 18వ తేదీ వరకు, రూ.200 ఫైన్‌తో 19 నుంచి 25వ తేదీ వరకు, రూ.500 ఫైన్‌తో 26 నుంచి 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశముందన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా పాఠశాల లాగిన్ నుంచి పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. పరీక్షల షెడ్యూల్‌ను కూడా ఇందులో చూడవచ్చన్నారు. వయస్సు మినహాయింపునకు ఫీజు రూ.300ను సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. ఫీజు డేట్స్ ఎలాంటి పరిస్థితులలో పొడిగించబడవని తెలిపారు.

పశువుల మూగరోదన

- పశువైద్యశాలల్లో మందుల కొరత
- అత్యవసర చికిత్సకూ తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మార్కాపురం/బేస్తవారిపేట:

పశువులకు రోగం వస్తే చికిత్స అందడం లేదు. పశువైద్యశాలల్లో మందులు లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వం గ్రామీణ పశు వైద్యశాలలతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా కూడా పశువులు, సన్న జీవాలు, కోళ్లకు వైద్య సేవలు అందించింది. అత్యవసర వైద్యం కోసం డాక్టర్ వైఎస్సార్ మొబైల్ అంబులెన్స్ క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లపై వైఎస్సార్ పేరు, ఫొటోలు తొలగించడంలో చూపిన అత్యుత్సాహం మూగజీవాల వైద్యంపై చూపడంలేదు.

పశువైద్యశాలలకు నిలిచిన మందుల సరఫరా...

జిల్లాలో తెల్ల పశువులు 56,332, నల్ల పశువులు 6,71,812, గొర్రెలు 15,67,122, మేకలు 4,17,589, కోళ్లు 8,33,434 కలిపి మొత్తం 35,46,289 వరకు ఉన్నాయి. వీటికి యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, యాంటీ హిస్టమైన్స్, సెలైన్ బాటిల్స్, పెన్సిలిన్, విషపూరితమైన మేత తిన్నప్పుడు వాడే మందులు, బాగా మేత తినడానికి మందులు వాడాల్సి ఉంది. కాల్షియం, ఎముకల పొడి వంటి 300 రకాలకుపైగా మందులు ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంది. గతంలో పశువైద్యానికి అవసరమైన మందులపై ఇండెంట్ పెట్టేందుకు జిల్లా స్థాయిలో టెక్నికల్ కమిటీ ఉండేది. గత ప్రభుత్వం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు, ఏరియా వెటర్నరీ హాస్పిటల్స్ ఏడీలు ఇలా ఎవరికి వారు తమ పరిధిలోని పశు సంపదను బట్టీ ఏఏ మందులు అవసరమనే దానిపై ఇండెంట్ పెట్టుకునే వెసులుబాటు కల్పించింది. ఇండెంట్ పెట్టినా ప్రస్తుతం పశువైద్యానికి మందులు రాని పరిస్థితి.


పశువైద్యశాలలో ఖాళీగా ఉన్న మందుల బీరువా


ఒక్కసారి కూడా డీవార్మింగ్‌కు నోచుకోని గొర్రెలు

ప్రధాన మందులు సైతం కొరత...

ముఖ్యంగా యాంటీబయాటిక్స్, పొట్ట ఉబ్బరం వస్తే ఉపయోగించే టిమ్‌ఫోనిన్, బ్లోబెండ్, వాతం వస్తే ఉపయోగించే పాడి మందు జెన్సీన్, చిరైట్, జింజర్, పొదుగువాపు వ్యాధి వస్తే ఉపయోగించే మూడు రకాల మందులతో పాటు యాంటీబయాటిక్స్, జీవాలకు దగ్గు వస్తే వాడే టైలోసిన్, చర్మవ్యాధులొస్తే ఉపయోగించే సల్ఫర్ బేస్ట్ పౌడర్, జ్వరానికి వాడే పారాసిటమాల్ మందుల కొరత ఏర్పడింది. వీటితోపాటు లైఫ్ సేవింగ్ మందులైన డెక్సామెథాజోన్, బీటా మెథాజోన్, ఐసోఫ్లెడ్ తదితర మందులు, దూడల్లో వచ్చే నట్టల నివారణ మందు కూడా కొరత ఏర్పడింది. దీంతో పశుపోషకులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు వాటికి వ్యాధులొస్తే డాక్టర్లు చీటీరాసిస్తే బయట కొనుగోలు చేసి తమ జీవాలను కాపాడుకుంటున్నారు.

మొబైల్ అంబులెన్స్‌లు నిర్వీర్యం...

గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని పశువులకు వైద్యం కోసం ఏర్పాటు చేసిన మొబైల్ అంబులెన్స్ క్లినిక్‌లకు మందులు సరఫరా చేయడం లేదు. వీటిని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గానికి రెండు అంబులెన్స్‌లు ఉన్నాయి. వీటిని సగానికి తగ్గించే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

నట్టల నివారణ మందు జాడలేదు...

ఏటా రెండు సార్లు జనవరి, జూన్ నెలల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు (డీవార్మింగ్) తాపాల్సి ఉంది. సకాలంలో డీవార్మింగ్ చేయకపోవడంతో జీవాలు రోగాల బారిన పడ్డాయని గొర్రెల పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారంరోజుల్లో మందుల కొరత తీరుతుంది :

జిల్లాలోని పశువైద్యశాలల్లో మందుల కొరత వారంరోజుల్లో తీరనుంది. త్వరలో అన్ని పశువైద్యశాలలకు మందులు వస్తాయి. ఆయా వైద్యశాలల్లో మందులు లేని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

బేబీరాణి, జాయింట్ డైరెక్టర్,
పశుసంవర్ధకశాఖ, ఒంగోలు

మందులు అందించాలి :



రాష్ట్ర ప్రభుత్వం పశువైద్యశాలలకు వెంటనే మందులు సరఫరా చేయాలి. జీవాలకు అనారోగ్యం వచ్చి వైద్యశాలకు తీసుకెళ్తే మందులు లేవంటున్నారు. బయట కొని వాటికి వైద్యం చేయించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెటర్నరీ మందులను త్వరగా వైద్యశాలలకు అందించాలి

జి.బాలనాగయ్య, గొర్రెలు, మేకల పెంపకందారుల
జిల్లా గౌరవాధ్యక్షుడు, మార్కాపురం

పశ్చిమ ప్రకాశంలో పశుపోషణే ప్రధానం...

పశ్చిమ ప్రకాశంలో వ్యవసాయంతో పాటు పాడిపశువులమీదనే ఆధారపడి రైతులు, ప్రజలు జీవిస్తుంటారు. వర్షాకాలంలో తరచూ వివిధ రకాల వ్యాధులకు పశువులు, జీవాలు గురవుతాయి. చూడిగేదెలు, గేదెలు, దూడల సంరక్షణ, పశుపోషకులకు భారంగా మారుతోంది. వివిధ ప్రాంతాల్లో రకరకాల నీరు తాగి చర్మరోగాలతో పాటు కడుపుబ్బరం, జ్వరం, నొప్పులతో బాధపడుతుంటాయి. వాటిని కాపాడుకునేందుకు పశుపోషకులు వైద్యశాలకు వెళితే మందులు లేవనే సమాధానం వస్తోంది. బయట కొనుగోలు చేసిన అరకొర మందులతో నెట్టుకొస్తున్నారు. బయట కొనుగోలు చేసేందుకు వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని, పశుపోషణ భారమైందని పోషకులు వాపోతున్నారు.

జిల్లాలోని 84 పశువైద్యశాలల్లోనూ అదే పరిస్థితి...


గడ్డి కోసం పొలాల వెంట తిరుగుతున్న గేదెలు

కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు దాటినా పశుసంతతి అభివృద్ధిపై దృష్టి సారించలేదు. పశువులకు చిన్నరోగం వచ్చి పశువైద్యశాలకు వెళితే.. మందులు తెచ్చుకుంటే వైద్యం చేస్తామని డాక్టర్లు అంటున్నారు. దీంతో పశువులు, గొర్రెలు, మేకలపెంపకం దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మొత్తం 84 పశువైద్యశాలలు, 55 గ్రామీణ పశువైద్యశాలలు ఉండగా, వీటితో పాటు త్రిపురాంతకం, యర్రగొండపాలెం, మార్కాపురం, కంభం, బేస్తవారిపేట, గిద్దలూరు, హనుమంతునిపాడు, కనిగిరి, సీఎస్ పురం, పొదిలి, కొండపి, టంగుటూరు, త్రోవగుంట, నాగులుప్పలపాడు, చీమకుర్తి, దర్శి, కురిచేడు, మద్దిపాడులో అసిస్టెంటు డైరెక్టర్ స్థాయి కలిగిన ఏరియా వైద్యశాలలు ఉన్నాయి. అయితే, నూతన ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలైనా పశువైద్యశాలలకు సంబంధించి అత్యవసరమైన (లైఫ్ మెడిసిన్) మందులు రాకపోవడంతో పశుపోషకులు, గొర్రెలు, మేకల పెంపకందారులు తమ జీవాలకు ఏమైనా రోగాలు వస్తే వాటిని కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. పశువైద్యశాలల్లో వైద్య సేవలు పూర్తిగా తగ్గిపోయాయి.

కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్

- ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కుట్రపూరిత రాజకీయాలు
- హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు అనవసరమైన రాద్ధాంతాలు
- వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు, అరెస్ట్‌లు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ ధ్వజం

ఒంగోలు సిటీ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ అన్నారు. సోమవారం ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల నుంచి ఏదో ఒక అంశంపై ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని ధ్వజమెత్తారు. హామీలు అమలు చేయడం లేదనే విషయం నుంచి ప్రజల ఆలోచనలను దారి మళ్లించి హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఆఫీస్ కూల్చిందని, పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించే పనిలోనే ఉందని విమర్శించారు. టీటీడీ లడ్డూ తయారీలో జంతువుల కొవ్వుతో తయారైన నెయ్యి వాడారని తప్పుడు ఆరోపణలు చేసి నెలరోజులు కాలయాపన చేసిందన్నారు. ప్రస్తుతం షర్మిల వివాదాన్ని తెరపైకి తెచ్చి వైఎస్ కుటుంబంలో కుట్రపూరితంగా చంద్రబాబు గొడవలు పెట్టారన్నారు. ఈ విషయాన్ని కొన్ని రోజులు నడిపిస్తారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాశ్వతంగా రాజకీయాల నుంచి ఎలిమినేట్ చేయాలనే కుట్రపూరితమైన ఆలోచనతో చంద్రబాబు క్రూరమైన, దుర్మార్గమైన ఆలోచనలతో షర్మిలను రెచ్చగొట్టి ఉసిగొల్పి జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని కాకుమాను రాజశేఖర్ ధ్వజమెత్తారు.


మాట్లాడుతున్న కాకుమాను రాజశేఖర్, పాల్గొన్న నాయకులు

రోజురోజుకూ పెరిగిపోతున్న హత్యలు, లైంగికదాడులు...

వైఎస్సార్ సీపీ నాయకులను హత్య చేస్తూ వాటిని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగా టీడీపీ నాయకుల దాడులు, వికృతచేష్టలు రాష్ట్రంలో రోజురోజుకూ పెరిగిపోతున్నాయని కాకుమాను రాజశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై మానభంగాలు, ముక్కుపచ్చలారని బిడ్డలపై రేప్‌లు, మర్డర్లు, కనీసం శవాలు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. దళితులపై దాడులు, ఆస్తుల ఆక్రమణలు జరుగుతున్నా ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటల్లో ఇప్పుడు ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని కాకుమాను ప్రశ్నించారు. మహిళలపై దాడులు, మానభంగాలు జరుగుతుంటే పవన్‌కళ్యాణ్ ఎందుకు నోరు విప్పడం లేదని విమర్శించారు. దళిత మహిళ అనితను హోం మినిస్టర్ చేసి రబ్బరుస్టాంపులాగా వాడుకుంటున్నారే తప్ప ఆమెకు ఎలాంటి అధికారాలు లేవని, ఉత్సవ విగ్రహంలా ఉన్నారని విమర్శించారు.

నూతన మద్యం పాలసీతో టీడీపీ నేతల దోపిడీ...

రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ తెచ్చి మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి కూటమి నాయకులు అడ్డంగా దోచుకుంటున్నారని కాకుమాను రాజశేఖర్ ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాలను కూటమి నాయకులు యథేచ్ఛగా విక్రయిస్తున్నారని, ఇసుక దోపిడీ ఇష్టారాజ్యంగా చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారం నుంచి దిగేముందు 80 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఉంటే.. ఎన్నికల ఫలితాలు వచ్చిన కూటమి నాయకులు మాయం చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, రాష్ట్ర బీసీ విభాగం జోన్-5 ఇన్‌చార్జ్ బొట్ల రామారావు, కార్పొరేటర్లు ప్రవీణ్, సాగర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చావలి శివ, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బడుగు ఇందిర, మహిళా నాయకురాలు భూమిరెడ్డి రమణమ్మ, వాణి ప్రసన్న, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పిగిలి శ్రీను, నాయకులు విజయ్, కఠారి సాయి, వీసం బాలకృష్ణ, ఆనం శ్రీనివాసరెడ్డి, జనార్దన్, 17వ డివిజన్ అధ్యక్షుడు చిన్నా, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి సానికొమ్ము వెలుగొండారెడ్డి, పి.వెంకయ్యనాయుడు, బుజ్జి, మున్సిపల్ కోఆప్షన్ మెంబరు స్వర్ణ శ్యామ్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కారు కావాలా.. డబ్బులు కావాలా..!

- ఫోన్ కాల్‌తో రూ.1.64 లక్షలు మోసపోయిన బాధితుడు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఫ్లిప్‌కార్ట్ నుంచి స్కోడా కారు బహుమతిగా వచ్చిందని ఫోన్ కాల్ రావడంతో అతడి ఆనందానికి అంతేలేకుండా పోయింది. కారు కావాలంటే కారు ఇస్తాం, లేకుంటే డబ్బులు కావాలన్నా ఇస్తామని చెప్పడంతో డబ్బులే కావాలని అడిగాడు. బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు నంబర్ అడిగిన వెంటనే ముందూవెనకా ఆలోచించకుండా ఇచ్చేశాడు. ఫీజు కింద రూ.1.64 లక్షలు చెల్లించమని అడగడమే తరువాయి.. డబ్బులు కూడా కట్టేశాడు. అంతే కారు లేదు, డబ్బులు లేవు. తీరా మోసం జరిగిపోయిందని లబోదిబోమంటూ ఎస్పీ ఏఆర్ దామోదర్ దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చాడు. నాగులుప్పలపాడు మండలానికి చెందిన ఒక బాధితుడు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసి బోరుమన్నాడు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. అలాగే చీటీపాటల పేరుతో భారీ మొత్తం కాజేశాడు చీమకుర్తికి చెందిన ఒక వ్యక్తి. రూ.5 లక్షల విలువ కలిగిన రెండు చీటీలను వేసింది ఒంగోలు చెందిన ఒక మహిళ. ఫోన్ పే ద్వారా చీటీ డబ్బు చివరి వరకు కట్టించుకున్న సదరు వ్యక్తి ఇప్పుడు చీటి డబ్బు అడుగుతుంటే ఖాళీ చేతులు చూపిస్తున్నాడని వాపోయింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 71 ఫిర్యాదులు వచ్చాయి. దిశ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ సమీవుల్లా, ఎస్సీ ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ రజియా సుల్తానా పాల్గొన్నారు.

పశువైద్యశాఖలో అవినీతిని సహించను

● జేడీ బేబీరాణి


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

కురిచేడు: పశువైద్యశాఖలో అవినీతిని సహించనని, పశువుల యజమానులకు ఎవరైనా మందులు అమ్మినట్లు రుజువైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని పశువైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే బేబీరాణి స్పష్టం చేశారు. మండలంలో లంపిస్కిన్ వ్యాధితో ఆవులు మృతిచెందడంపై సోమవారం పొట్లపాడు సచివాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. లంపిస్కిన్ వ్యాధికి టీకాలు కూడా లేవని, మేకలు, గొర్రెలకు వేసే గోట్‌ఫాక్స్ వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. లంపిస్కిన్ వ్యాధి కేవలం తెల్లపశువులకు మాత్రమే వస్తోందన్నారు. సీజనల్ వారీగా వచ్చే వ్యాధులకు టీకాలు పంపుతున్నామని, అన్నీ వేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్నారని ఆమె తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం కుదరదన్నారు. టీకాల నిల్వకు ప్రతి ఆర్‌బీకేలో చిన్న రిఫ్రిజ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. లంపిస్కిన్ వ్యాధి గాలి ద్వారా, వ్యాధిసోకిన పశువుల ద్వారా కూడా వ్యాపిస్తోందన్నారు. చికిత్స చేస్తే తగ్గుతుందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని పశుపోషకులకు భరోసా ఇచ్చారు. ఆవులు లంపిస్కిన్‌తో బాధపడుతుంటే డాక్టర్లు రాలేదని పలువురు పశుపోషకులు జేడీకి తెలిపారు. ఆమె స్పందిస్తూ.. సిరియస్‌గా ఉన్న పశువులకు వైద్యులు వచ్చి చికిత్స చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ గంటా నాగేశ్వరరావు, గంగదొనకొండ సర్పంచ్ భర్త ఆసుపల్లి నారాయణరెడ్డి, మండలంలోని ఆహాలు, పొట్లపాడు సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ జారిపడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమరావు

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన గుంటక సత్యనారాయణ (75) బాత్‌రూములో జారిపడి మృతి చెందినట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు. ఇంట్లో ఒక్కడే నివసిస్తున్న సత్యనారాయణ.. పలు ఆరోగ్య సమస్యలతో మందులు వాడుతున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పోలీసులకు స్థానికులు సోమవారం సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి మృతిచెంది 5 రోజులై ఉండవచ్చని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన ప్రభాకర్

నాగులుప్పలపాడు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి నాగులుప్పలపాడు మండలంలోని ఈదుమూడి సమీపంలో చోటుచేసుకుంది. ఏఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన బక్కా ప్రభాకర్ (45) సోమవారం రాత్రి ఉప్పుగుండూరు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈదుమూడి సమీపంలోకి వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలాన్ని ఏఎస్సై పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.